సాక్షి
శ్రీకాకుళం
ఆదివారం | 24 | ఆగస్టు | 2025



ప్రకృతి సేద్యానికి సై

ప్రకృతి సేద్యానికి రైతులు సై అంటున్నారు. తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధ్యమవుతాయి.

- 8లో



ప్రైవేటు బస్సు ఢీకొని..

ప్రైవేటు బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఆదివారం సంత కూడలి వద్ద ప్రమాదం జరిగింది.

- 8లో

మగ్గంవర్క్‌లో ఉచిత శిక్షణ

ఎచ్చెర్ల: యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఎచ్చెర్లలో ఈ నెల 29వ తేదీ నుంచి జిల్లా మహిళల కోసం మగ్గం వర్క్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ తరగతులను ప్రారంభించనున్నట్లు సంస్థ డైరెక్టర్ రామ్‌జీ తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయాలను కల్పించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 7993340407, 9553410809 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

న్యూస్‌రీల్

'పెన్షన్ల తొలగింపునకు కూటమి కుట్ర'



ధర్మాన కృష్ణదాస్

నరసన్నపేట: దివ్యాంగుల పింఛన్లు తొలగించేందుకు కూటమి రోజుకో కుట్ర పన్నుతోందని, రోజుకో ప్రకటన చేస్తూ దివ్యాంగుల్లో ఆందోళన కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం దాన్ని వదిలేసి దివ్యాంగులకు ఇస్తున్న పింఛన్లు నిలిపివేసేందుకు పన్నాగాలు పన్నుతోందన్నారు. రీ వెరిఫికేషన్, రీ ఎసెస్‌మెంట్ పేరున మళ్లీ వైద్యుల వద్దకు వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకోవాలని నోటీసులు ఇస్తుండడంపై ఆయన మండిపడ్డారు. వైకల్యం 40 శాతం కంటే తగ్గిందన్న సాకుతో పెన్షన్లు తొలగిస్తామనడం మానవత్వానికి విరుద్ధమన్నారు. పదేళ్లకు పైబడి పెన్షన్లు తీసుకుంటున్న వారు ఇప్పుడు అనర్హులు అనడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వం కుట్రలు మాని వస్తున్న పెన్షన్లను యథావిధిగా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం




ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

శ్రీకాకుళం క్రైమ్ : ఎరువుల బ్లాక్ మార్కెటింగ్ నివారణ కోసం జిల్లాలో శనివారం ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడులు ముమ్మరంగా జరిగాయి. రాష్ట్ర విజిలెన్స్ డైరెక్టర్ జనరల్ హరీష్‌గుప్తా ఆదేశాల మేరకు శ్రీకాకుళం ప్రాంతీయ నిఘా, అమలు అధికారి (విజిలెన్స్ ఎస్పీ) బర్ల ప్రసాదరావు తమ బృందాలతో జిల్లాలో ఏడు చోట్ల దాడులు చేయించడమే కాక పక్క జిల్లాలైన విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల్లో మరో 10 చోట్ల చేయించారు. స్థానిక రెవెన్యూ, పోలీస్, వ్యవసాయాధికారులతో కలిసి సంయుక్తంగా ఈ దాడులు జరిపారు. జిల్లాలోని గార మండలం శ్రీకూర్మంలో శ్రీ విజయలక్ష్మి ఏజెన్సీ లైసెన్స్ పునరుద్ధరణ చేయకుండా విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఇక్కడ సుమారు రూ. 7 లక్షల విలువల కలిగిన 28.4 టన్నుల ఎరువులు అమ్మవద్దని సిఫార్సు చేశారు.

నేడు పలాసలో రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు మూసివేత

వజ్రపుకొత్తూరు: పలాస రైల్వే లెవెల్ క్రాసింగ్ గేటు అత్యవసర మరమ్మతుల దృష్ట్యా ఆదివారం వేకువజాము రెండు గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు ఏడు గంటల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆ సమయంలో రాకపోకలు పూర్తిగా నిలిపివేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని ప్రయాణికులు, వాహనచోదకులు గమనించాలని కోరారు.

అనుకున్న అప్లికేషన్లు రాకపోతే దరఖాస్తు ఫీజు వాపసు



శ్రీకాకుళం క్రైమ్ : మద్యం బార్ పాలసీలో నిబంధనలు అనుసరించి అనుకున్న దరఖాస్తులు రాకపోతే ఫీజు రూ. 5 లక్షలు తిరిగి వాపసు చేస్తామని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు అన్నారు. శనివారం ఈ విషయాన్ని స్పష్టం చేశారు. లాటరీకి అర్హత సాధించాలంటే కనీసం 4 అప్లికేషన్లు అయినా రావాలనే నిబంధన ఉన్న విషయం తెలిసిందే.

లైసెన్సు ఫీజులు ఇలా..

శ్రీకాకుళం కార్పొరేషన్ (11), పలాస మున్సిపాలిటీ (02)ల పరిధి 13 బార్లకు ఏడాదికి రీటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (లైసెన్సు) ఫీజుగా రూ. 55 లక్షలు, ఆమదాలవలస(02), ఇచ్ఛాపురం (02) మున్సిపాలిటీలకు రూ. 35 లక్షలు ఆరు దఫాలుగా చెల్లించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్, హైబ్రిడ్, ఆఫ్‌లైన్‌లో స్వీకరిస్తామని, ఈ నెల 26 సాయంత్రం 5 గంటల వరకు చివరి గడువు అని, ఈనెల 28న జిల్లాకేంద్రంలో అంబేడ్కర్ ఆడిటోరియంలో లాటరీ ప్రక్రియలో డ్రా తీస్తామన్నారు. ఉపకులాలైన శ్రీశయన, సొండి కులస్తులకు శ్రీకాకుళం కార్పొరేషన్, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీకి కేటాయించిన రెండు బార్లకు లైసెన్సు ఫీజు రూ.27.50 లక్షలు కట్టాలని, దరఖాస్తు ఫీజు రూ. 5 లక్షలన్నారు. వీరికి దరఖాస్తు స్వీకరణ గడువు ఈనెల 29 అని, కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 30న లాటరీ తీస్తామన్నారు. ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసేవారు జిల్లాలోని భాష్యం స్కూలు సమీప జిల్లా ఎక్సైజ్ అధికారి కార్యాలయానికి వచ్చి డీపీఈఓ ఆఫీస్ పేరిట చలానా కట్టాలన్నారు.

ఎరువు కోసం పొరుగు రాష్ట్రానికి..

- ఒడిశాకు వెళ్లి యూరియా తెచ్చుకుంటున్న రైతులు
- రైతు సేవా కేంద్రాల్లో కానరాని యూరియా
- ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్న అన్నదాతలు



అన్నదాత మళ్లీ క్యూ కడుతున్నాడు. లేని యూరియా కోసం రాని ఎరువు కోసం గంటల తరబడి లైనుల్లో నించోలేక అవస్థలు పడుతున్నాడు. అధికార పార్టీ వారు 'ఎరువుల దారి మళ్లింపు' పథకం విజయవంతంగా అమలు చేయడంతో బస్తా ఎరువు కోసం పొరుగు రాష్ట్రానికి వెళ్లాల్సిన దీనావస్థను ఎదుర్కొంటున్నాడు. ప్రైవేటు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నా.. రైతు సేవా కేంద్రాల వద్ద నిస్సహాయంగా నిరీక్షిస్తున్నా ఎరువు మాత్రం కరువే.

టెక్కలి:

వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గం టెక్కలితో పాటు పలాస, ఇచ్ఛాపురంలో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఎరువుల కష్టాలు ఎలా ఉన్నాయంటే.. ఒడిశా ప్రాంతానికి వెళ్లి యూరియా కొనాల్సిన పరిస్థితులు ఉన్నాయి. గతంలో ఎన్నడూ ఇలాంటి యూరియా కష్టాలు లేవంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అల్పపీడనం ప్రభావంతో వర్షాలు పడడంతో ఇప్పుడు పొలం పనులు ఊపందుకున్నాయి. కానీ యూరియా మాత్రం ఎక్కడా దొరకడం లేదు. అధికారులు, నాయకులు మాత్రం యూరియా కొరత లేదని ప్రకటనలు చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు, సొసైటీల ద్వారా ముందుగా సరఫరా చేసిన యూరియాను అధికార పార్టీ కార్యకర్తలు దారి మళ్లింపు చేసేయడంతో ఇప్పుడు రైతు సేవా కేంద్రాల్లో ఎక్కడా యూరియా దొరకడం లేదు. దీంతో టెక్కలి రైతులు ఒడిశా వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నారు. మరో వైపు స్థానికంగా ప్రైవేట్ డీలర్ షాపుల వద్ద యూరియా కోసం రైతులు క్యూ కడుతూ అవస్థలు పడుతున్నారు. టెక్కలి నియోజకవర్గానికి మరో 1600 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం.

అధికారుల వద్ద సమస్యల ఏకరువు

గ్రామాల్లో తమకు యూరియా దొరకడం లేదని, కనీసం పట్టణాల్లో ప్రైవేట్ ఎరువుల దుకాణాల వద్ద యూరియా కోసం వెళ్తే అదనంగా జింక్‌తో పాటు మరికొన్ని పురుగు మందులను బలవంతంగా అంటగడుతున్నారంటూ రైతులు అధికారులు ఎదుట వాపోయారు. శనివారం టెక్కలి ఆర్డీఓ ఎం.కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ ఏడీ కె.జగన్మోహన్‌రావు, డీఎస్పీ డి.లక్ష్మణరావు, తహసీల్దార్ సత్యం, వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, సీఐ విజయ్ కుమార్ తదితరులు బృందంగా టెక్కలిలో పలు ప్రైవేట్ ఎరువులు దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా తంగుడు విష్ణుమూర్తి దుకాణం వద్ద రైతులంతా తమ గోడును వెలిబుచ్చారు. యూరియా కొనాలంటే అదనంగా జింకును కొనుగోలు చేయాలంటూ డీలర్లు తమపై ఒత్తిడి చేస్తున్నారంటూ వాపోయారు. మరో వైపు వైశ్యరాజు దుకాణం వద్ద యూరియా కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూ కట్టడం కనిపించింది.

▶▶ పలాసలో ఇలా..

పలాస: పలాస నియోజకవర్గంలోని మూడు మండలాలు, ఒక మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రైతులు ఎరువుల కోసం నానా పాట్లు పడుతున్నారు. పలాసలో ప్రైవేటు దుకాణాల్లో రైతులకు అవసరమైన ఎరువులు లభించకపోవడంతో ఒడిశా ప్రాంతాల నుంచి తెచ్చుకుంటున్నారు. పలాసలో ప్రైవేటు దుకాణాల్లో రూ.270 ఉండగా ఒడిశా రాష్ట్రంలోని గారబందకు మోటారు బైకుల మీద వెళ్లి ఒక బస్తా యూరియాను అధిక రేటు ఇచ్చి కొనుగోలు చేస్తున్నామని అల్లుకోల గ్రామానికి చెందిన రైతులు చెబుతున్నారు. వర్షాలు బాగా పడటంతో ఒకే సారి దమ్ములు కావడం, గతంలో వేసిన ఎదలకు కూడా ఎరువులు వేయాల్సి రావడంతో యూరియాతో పాటు డీఏపీ ఎరువు కూడా అవసరం ఉంది. ఈ రెండు రకాల ఎరువులు ఎక్కడా లభించడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతు సేవా కేంద్రాలు గ్రామాల్లో నామమాత్రంగా మిగిలాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒడిశా గారబంద నుంచి మోటారు బైక్‌పై ఎరువు తెస్తున్న అల్లుకోల రైతు కొవ్వూరు ధనరాజు

▶▶ యూరియా పంపిణీలో పక్షపాతమా..



వైఎస్సార్ సీపీ హయాంలో రైతులను అపురూపంగా చూసుకున్నాం. కూటమి ప్రభుత్వం మాత్రం వారి వర్గీయులకే ఎరువులు ఇస్తోంది. యూరియా పంపిణీలోనూ పక్షపాతం ప్రదర్శిస్తున్నారు. ఇచ్ఛాపురం మండలంలో 16 రైతు సేవా కేంద్రాలకు అందించాల్సిన యూరియాను కేవలం ఐదు కేంద్రాలకే సరఫరా చేసి సొసైటీ ద్వారా కూటమి కార్యకర్తలకే అధిక మొత్తంలో సరఫరా చేశారు.

– పిరియా విజయ, జెడ్పీ ఛైర్ పర్సన్ (ఇచ్ఛాపురం ఎంపీపీ కార్యాలయంలో జరిగిన పార్టీ కార్యకర్తల సమావేశంలో..)



బూర్జ గ్రామంలో ఎరువుల కోసం ప్రైవేటు షాపు ఎదురుగా నిరీక్షిస్తున్న రైతులు



టెక్కలిలో ఆకస్మిక తనిఖీలకు వచ్చిన ఆర్డీఓ కృష్ణమూర్తితో పాటు రెవెన్యూ, వ్యవసాయ, పోలీస్ అధికారుల ఎదుట యూరియా దొరకడం లేదంటూ వాపోతున్న రైతులు

ఒడిశా వెళ్లి తెచ్చుకున్నాం..

మా గ్రామంలో రైతులకు యూరియా అందుబాటులో లేకపోవడంతో ఆటోలు కట్టుకుని మరీ ఒడిశా ప్రాంతాలకు వెళ్లి యూరియా బస్తాలు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు. యూరియా కోసం రైతులంతా ఇబ్బందులు పడుతున్నాం.

– బి.బాబూరావు, రైతు, అన్నాపురం, నందిగాం మండలం

ఎరువు అందక ఇబ్బందులు

మా మండలంలో రైతులకు యూరియా దొరక్కపోవడంతో ఒడిశా ప్రాంతంలో గుసానితో పాటు మరి కొన్ని గ్రామాలకు వెళ్లి యూరియా తెచ్చుకుంటున్నారు. రైతులకు యూరియా అందజేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు.

– ఎస్.శ్యామ్‌సుందర్, రైతు, కల్లాడ, నందిగాం మండలం.

▶▶ కట్టలు తెగిన ఆగ్రహం

బూర్జ: బూర్జ గ్రామంలో ప్రైవేటు ఎరువుల షాపునకు శనివారం ప్రభుత్వం నుంచి 120 బస్తాల ఎరువులు వచ్చాయి. రైతులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. మండలానికి అవసరమైనంత ఎరువులు సరఫరా చేయకుండా 120 బస్తాలు మాత్రమే తెప్పిస్తే ఎట్లా సరిపోతాయని రైతన్నలు ఆగ్రహంతో మండల తహసీల్దార్ వైవీ పద్మావతిని, వ్యవసాయ శాఖ ఏఓని నిలదీశారు. ఎరువుల షాపు షట్టర్ కూడా దించేశారు. స్థానిక ఎస్ఐ ఎం.ప్రవల్లిక కలుగజేసుకొని రైతులకు నచ్చజెప్పడంతో ఎరువుల పంపిణీ సోమవారానికి వాయిదా వేశారు.

▶▶ ఇచ్ఛాపురంలో నో స్టాక్

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి సరిపడా ఎరువులు సరఫరా చేయకపోవడంతో రైతులు ఒడిశా వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. కంచిలి మండల పరిధిలో ఈ ఖరీఫ్‌కు సంబంధించి కేవలం మూడు వేల బస్తాల యూరియానే సరఫరా చేశారు. వాస్తవానికి ఒక ఎకరాకు రెండు బస్తాలు చొప్పున యూరియా సరఫరా చేయాల్సి ఉంది. కానీ ఇక్కడ 11,259 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. కేవలం 3వేలు బస్తాలు మాత్రమే సరఫరా చేయడంతో, మిగతావారు సబ్సిడీ ధరకు ఈ ప్రభుత్వం సరఫరా చేసే యూరియా కోసం ఎదురు చూస్తుండగా, మరికొందరు సమయం మించిపోతుండటంతో వ్యయప్రయాలకోర్చి సరిహద్దు ఒడిషా గ్రామాలకు వెళ్లి అధిక ధరకు యూరియా కొనుగోలు చేస్తున్నారు.

ఒడిశాపైనే ఆధారం..



స్థానికంగా సబ్సిడీపై సరిపడా ఎరువులు సరఫరా చేయకపోవడంతో సరిహద్దు ఒడిశా నుంచే ఎరువులు కొనుగోలు చేసుకొంటున్నాం. ఇక్కడ సబ్సిడీ ధరకు రూ.270కు విక్రయిస్తుండగా, ఇక్కడ లభ్యం కాకపోవడంతో రూ.600లు చొప్పున కొనుగోలు చేసుకోవాల్సి వస్తుంది.

– కొయిరా గౌడో, రైతు, మాజీ సర్పంచ్, జలంత్రకోట

▶▶ రైతు కన్నీరులో కొట్టుకుపోతారు

- సర్కారును దునుమాడిన మాజీ స్పీకర్ తమ్మినేని
- ఎరువుల పరిశీలనకు వెళ్తున్న తమ్మినేనిని అడ్డుకున్న పోలీసులు

ఆమదాలవలస : శ్రీకాకుళం రోడ్ ఆమదాలవలస రైల్వే గూడ్స్ గోదాం వద్ద శనివారం ఉద్రిక్తత నెలకొంది. ఎరువులు రైతులకు సక్రమంగా అందడం లేదని, ఈ గోదాం నుంచి ఎరువులు పక్కదోవ పడుతున్నాయని కొందరు మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన తన తనయుడు చిరంజీవి నాగ్‌తో కలిసి శనివారం రైతులకు న్యాయం చేయాలని ప్రయత్నించారు. అయితే పోలీసులు తొలుత చిరంజీవి నాగ్‌ను అడ్డుకున్నారు. అనంతరం పెట్రోల్ బంకు సమీపంలో తమ్మినేనిని అడ్డుకుని వెనక్కి వెళ్లాలని కోరారు. ఆయన మాత్రం రోడ్డుపైనే బైఠాయించారు. దీంతో ఆయనను జీపు ఎక్కించి నివాసానికి తరలించి పోలీసులను కాపలాగా ఉంచారు. అనంతరం తమ్మినేని విలేకరులతో మాట్లాడారు. రైతు కన్నీరు పెడితే ఎవరైనా కొట్టుకుపోతారని అన్నారు. ఆమదాలవలసలో రైతు సేవా కేంద్రాల ద్వారా కూడా ఎరువులు ఇవ్వలేదన్నారు. తన రాజకీయ చరిత్రలో ఇలాంటి దుస్థితి ఎప్పుడూ చూడలేదన్నారు. నియోజకవర్గంలో రైతులు ఎదుర్కొంటున్న ఎరువుల సమస్యలపై గతంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లానన్నారు. జిల్లావ్యాప్తంగా ఎరువులను ఆమదాలవలస కేంద్రంగా రైల్వే గూడ్స్ గోదాం నుంచి సరఫరా చేస్తారని, రైతు భరోసా కేంద్రాలకు, ఎరువుల డీలర్లకు ఇక్కడి నుంచే సరఫరా జరుగుతున్నప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాతే ఎరువుల కొరత జిల్లాలో నెలకొందని అన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలాంటి పరిస్థితులు లేవన్నారు. సమావేశంలో పార్టీ ముఖ్య నాయకులు బొడ్డేపల్లి నారాయణరావు, అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, ప్రభాకరరావు, చల్ల సింహాచలం, బోర నర్సునాయుడు, తమ్మినేని వేణు, ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను అడ్డుకున్న పోలీసులు

ఎవర్‌గ్రీన్ కానుక

- పుట్టిన రోజుకో మొక్క నాటుతున్న విద్యార్థులు
- అవలంగిలో బర్త్ డే గార్డెన్
- 216 మొక్కలు నాటిన విద్యార్థులు

హిరమండలం: అవలంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆకుపచ్చని జ్ఞాపకాలు పోగేసుకుంటున్నారు. పుట్టిన రోజు కానుక బతుకంతా కనిపించేలా బాధ్యతగా వ్యవహరిస్తున్నారు. స్కూల్‌లో పుట్టిన రోజు వేడుకలు చేసుకునే సందర్భాల్లో కేక్‌లు కట్ చేయకుండా ఆ పాఠశాల విద్యార్థులు మొక్కలు నాటుతున్నారు. వాటి సంరక్షణకు శపథం చేస్తున్నారు. ఏడాది పొడవునా వాటి ఆలనాపాలనా చూస్తారు. ఇప్పటివరకూ 216 మొక్కలు నాటారు. నిత్యం వాటి సంరక్షణ చూస్తున్నారు. దీంతో సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ గ్రీన్ స్కూల్ ప్రోగ్రామ్ కింద అవలంగి పాఠశాలను గుర్తించి అభినందనలు తెలిపింది.

సైన్స్ ఉపాధ్యాయుడి ప్రోత్సాహంతో..

పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు డొక్కరి ధనుంజయ ఈ మొక్కల పెంపకం అనే యజ్ఞాన్ని ప్రారంభించారు. 2021 జనవరి నెలలో పాఠశాలల్లో బాధ్యతలు స్వీకరించిన ధనుంజయరావు వినూత్న ఆలోచన చేశారు. ఇక నుంచి విద్యార్థుల పుట్టిన రోజుల నాడు మొక్కలు నాటి సంరక్షించాలని తీర్మానం చేశారు. అప్పటి నుంచి మొక్కలను పెంచడం ప్రారంభించారు. ఇటీవల పాఠశాలను సందర్శించిన విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలల్లో కూడా ఇదే విధానాన్ని అనుసరించాలని సూచించారు.



మొక్కలను సంరక్షిస్తున్న ధనంజయ

ఆనందంగా ఉంది..

సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ గుర్తించడం ఆనందంగా ఉంది. మొక్క అనేది జీవకోటికి మూలం. చెట్లు వాతావరణ సమతుల్యతకు, మనిషికి ఆక్సిజన్లు ఇస్తాయి. అందుకే విద్యార్థులకు ప్రాథమిక స్థాయి నుంచి మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

– డొక్కర ధనుంజయ, సైన్స్ ఉపాధ్యాయుడు



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

అనుమతులు ఆన్‌లైన్‌లోనే..



శ్రీకాకుళం క్రైమ్ : గణనాథుని ఉత్సవాల్లో భాగంగా మండపాలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర పోలీస్ శాఖ ప్రత్యేకంగా హెచ్‌టీటీపీఎస్:జీఏఎన్ఈఎస్‌హెచ్‌యుటీఎస్ఎవి.ఎన్ఇటీ అనే ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా సింగిల్ విండో విధానం ప్రవేశపెట్టిందని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శనివారం ఈ మేరకు ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. అన్ని రకాల అనుమతులు ఒకేసారి పొందేలా ఉండే ఈ విధానంలో ప్రజలు ఎలాంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- కమిటీ సభ్యులు ఆధార్, చిరునామాలు, ఫోన్ నంబర్లు, విగ్రహాల ఎత్తు, బరువు, పూజా దినాల సంఖ్య, వినాయక ఊరేగింపు, నిమజ్జన సమయాలు, రూట్‌మ్యాప్ వివరాలు తెలపాలి.
- నిర్వాహకులు మండపాలు ఉండే ప్రదేశం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి.
- నిర్దేశించిన ప్రాంతం, సమయాల్లో మాత్రమే విగ్రహ ఊరేగింపు, నిమజ్జనం చేయాలి. రాత్రి 10 లోపు ముగించాలి.
- మండపాల వద్ద ఎక్కువ శబ్ద కాలుష్యం చేసే లౌడ్ స్పీకర్లు ఉపయోగించరాదు. స్పీకర్లను ఉదయం 6 నుంచి రాత్రి 10 గంటల వరకే వినియోగించాలి.
- విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రిళ్లు మండపాల వద్దనే ఉండాలి.
- మండపాల వద్ద గానీ, ఊరేగింపులో గానీ బాణాసంచా వినియోగించరాదు.
- నిమజ్జన సమయంలో అశ్లీల నృత్యాలు గానీ డీజే శబ్దాలు గానీ ఉండరాదు.
- బలవంతపు చందాలు, వసూళ్లు, దర్శనాల టికెట్లు పెట్టరాదు. ఇలాంటి చర్యలకు పాల్పడితే ఫిర్యాదు చేయడానికి డయల్ 100కు ఫోన్ గానీ 6309990933 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు శిక్షణ

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశాల మేరకు జిల్లాలోని యువతను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు వీలుగా.. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎమ్ఈ) విస్తరణకు రూపొందించిన ర్యాంపు(ఆర్ఏఎంపీ) పథకం ద్వారా శిక్షణ కార్యక్రమాల నిర్వహించనున్నట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఎం.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. డ్రెడ్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో పరిశ్రమల వ్యవస్థాపకత వృత్తి నైపుణ్యతపై పలాస, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస, రణస్థలంలలో నెల రోజుల పాటు శిక్షణ ఉంటుందని, 18-40 ఏళ్ల మధ్య వయసున్నవారు అర్హులని తెలిపారు. వివరాలకు సమన్వయకర్త అరుణ్‌కుమార్ సెల్ 8688455692 సంప్రదించాలని కోరారు.

చిట్టి చేతుల్లో మట్టి గణపతి





కొత్తూరు మండలం అడవికొత్తూరు ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులు మట్టి వినాయకులను తయారు చేశారు. చిట్టి చేతులతో చేసిన మట్టి వినాయక విగ్రహాలను వినాయక చవితి నాడు పూజిస్తామని హెచ్‌ఎం జీవీ రమణ శనివారం తెలిపారు.

– కొత్తూరు

క్లుప్తంగా

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఈవోకు విరాళం అందజేస్తున్న దాతలు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి రూ.1,01,116 నగదును విశాఖపట్నానికి చెందిన కొల్లి తిరునాథరెడ్డి, ఝాన్సీ రాణి దంపతులు శనివారం సమర్పించారు. తన తల్లి సత్యవతి జ్ఞాపకార్థం ఈ విరాళాన్ని అందజేస్తున్నట్లు దాతలు తెలియజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్, సూపరింటెండెంట్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సముద్రపు నాచు పెంపకంపై అవగాహన



సముద్రపు నాచు పెంచే చెరువులను పరిశీలిస్తున్న కలెక్టర్

సోంపేట: సముద్రపు నాచు పెంపకంపై మహిళలు అవగాహన పెంచుకుని అదనపు ఆదాయాన్ని పొందాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. సోంపేట మండలం గొల్లూరు పంచాయతీ మూల పొలం గ్రామంలో జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు, ఉదయ్ ఆక్వా ఆధ్వర్యంలో సాగు చేస్తున్న సముద్రపు నాచు పెంపకం చెరువులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక మత్స్యకార మహిళలతో సీఎం చంద్రబాబునాయుడు వర్చువల్‌గా మాట్లాడారు. నాచు పెంపకం వల్ల కలిగే ఆదాయంపై ఆరా తీశారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, డివిజన్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుకు ప్రాధాన్యత



ఇరపాడులో వంగ తోటను పరిశీలిస్తున్న అధికారులు

కొత్తూరు: జిల్లాలో సుమారు లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తున్నట్లు జిల్లా ఉద్యానవన అధికారి వరప్రసాదరావు తెలిపారు. కొత్తూరు మండలం ఇరపాడులో గొర్లె గౌరినాయుడుకు చెందిన ప్యాక్ హౌస్‌ను ఏపీ మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు పీడీ శ్రీనివాసరావులతో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాక్ హౌస్‌లకు ప్రభుత్వం రూ.రెండు లక్షలు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది 18 హౌస్‌లు నిర్మించగా, ఈ ఏడాది 22 నిర్మించేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల ఉద్యానవన అధికారి బి.అయింతి పాల్గొన్నారు.

డీఈఓను తక్షణమే నియమించాలి

శ్రీకాకుళం: జిల్లా విద్యాశాఖ అధికారిని తక్షణమే నియమించాలని డీటీఎఫ్ నాయకులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు శనివారం డిమాండ్ చేశారు. 25 రోజులుగా రెగ్యులర్ డీఈఓను గానీ, పూర్తి అదనపు బాధ్యతలతో డీఈఓను నియమించకపోవడం విచారకరమన్నారు. విద్యా వ్యవస్థ కుంటుపడుతోందని ఫైళ్లు పెండింగ్‌లో ఉండిపోవడంతో పలువురు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఆగస్టులో ఇంక్రిమెంట్లకు సంబంధించిన ఫైళ్లపై సంతకాలు లేకపోవడంతో పాత జీతంతోనే బిల్లులు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. వీసాలు, పాస్‌పోర్టులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం కొందరు ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారని, అవి కూడా పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.

ఎమ్మెల్యే దగ్గుపాటి బహిరంగ క్షమాపణ చెప్పాలి



నిరసన తెలియజేస్తున్న ఎన్టీఆర్ అభిమానులు

శ్రీకాకుళం అర్బన్: అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ బహిరంగ క్షమాపణ చెప్పాలని జిల్లా ఎన్టీఆర్ అభిమానులు డిమాండ్ చేశారు. శనివారం శ్రీకాకుళంలోని సరస్వతీ థియేటర్ ఆవరణలో జిల్లా ఎన్టీఆర్ అభిమానులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్, శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు దుంగ శ్రీధర్, శ్రీకాకుళం నగర ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు బుర్రి మధు మాట్లాడుతూ నందమూరి కుటుంబ సభ్యురాలైన నందమూరి షాలిని, జూనియర్ ఎన్టీఆర్‌లను దుర్భాషలాడినందుకు ఎమ్మెల్యేను తక్షణమే టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో పలువురు అభిమానులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యానికి సై!



కొత్తూరు మండలం లబ్బ గ్రామంలో ప్రకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న వరి పంట

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ఉత్పత్తులకు మార్కెట్‌లో గిరాకీ
- భూసారం పెరుగుదలకు దోహదం

పంట	రైతులు	విస్తీర్ణం
వరి	59 వేల మంది	63,000 ఎకరాలు
మొక్కజొన్న	5 వేల మంది	6,300 ఎకరాలు
ఉద్యానవన పంటలు	12 వేలు	9,000 ఎకరాలు
ఇతర పంటలు	1000	21,701 ఎకరాలు

కొత్తూరు:

ప్రకృతి విధానంలో వ్యవసాయం చేసే రైతుల సంఖ్య ఏటా పెరుగుతూ వస్తోంది. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా సహజంగా లభించే ఆవు పేడ, కషాయాలను పంట సాగుకు వినియోగిస్తూ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు తయారు చేస్తున్నారు. వీటికి మార్కెట్‌లో ఆదరణ బాగుండటంతో ప్రకృతి సేద్యం చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వినియోగదారులకు ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు అందించడంతో పాటు భూసారం పెంచేందుకు ప్రకృతి వ్యవసాయం ఎంతగానో దోహదం చేస్తున్నందున ప్రభుత్వాలు సైతం ప్రోత్సాహం అందిస్తున్నారు. జిల్లాలోని 30 మండలాల్లో సుమారు 77 వేలు మంది రైతులు సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్నారు.

విస్తృత అవగాహన..

ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తరచూ గ్రామాలకు వెళ్లి రైతులతో సమావేశమవుతున్నారు. ప్రకృతి సేద్యం వల్ల కలిగే లాభాలను వివరిస్తున్నారు. రసాయిన ఎరువులు, పురుగు మందులు వినియోగించడం వల్ల భూమికి, రైతులకు కలుగుతున్న నష్టాలను తెలియజేస్తున్నారు. అధిక ధరలు పలికే రసాయన ఎరువులకు బదులు తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే జీవామృతం, బీజామృతం, నీమాస్త్రం, మీనామృతం వంటి కషాయాలపై అవగాహన కల్పిస్తున్నారు. వరి నాట్లు వేసే సమయంలో కాలిబాటలు వదలడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. భూమి మరింత సారవంతంగా మారేందుకు పీఎండీఎస్ కిటు (నవ ధాన్యాలు కిట్లు) సైతం రైతులకు పంపిణీ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం విధానంలో పంటల సాగు విస్తీర్ణం పెంచేందుకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. గత ఖరీఫ్ కంటే ఈ ఏడాది అన్ని రకాల పంటలు కలిపి సుమారు 40 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు చర్యలు..

ప్రకృతి వ్యవసాయం సాగు పెంచేందుకు పలు రకాలుగా చర్యలు చేపడుతున్నాము. ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు పీడీఎం కిట్లు తక్కువ దరలకు ఇవ్వడం జరిగింది. పలు రకాల కషాయాలు తయారు పై శిక్షణను రైతులకు ఇస్తున్నాము. సాగు విస్తీర్ణం పెంచేందుకు పొలం బడిలో కూడా రైతులకు ప్రకృతి వ్యవసాయం పద్ధతులు పై అవగాహన కల్పిస్తున్నాము.



సోమరాజపురంలో జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

బహుళ ప్రయోజనాలు..

- ప్రస్తుత సమాజంలో ఆరోగ్య స్పృహ పెరగడంతో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా పంట ఉత్పత్తులు లభిస్తుండటంతో కొనుగోళ్లు బాగా జరుగుతున్నాయి.
- దేశీయ ఆవుపేడతో జీవామృతం సొంతంగా తయారు చేసుకోవచ్చు. బీజామృతం, వేప కషాయాలు, మీన కషాయాల తయారీకి ఖర్చు తక్కువే.
- రసాయన ఎరువులు బదులుగా పేడ, కుళ్లిన గత్తం వంటివి వాడితే భూమి సారం పెరుగుతుంది. వాన పాములు, ఇతర సూక్ష్మజీవులు పెరిగి జీవ వైవిధ్యం కాపాడతాయి.
- రసాయన ఎరువులు వాడకపోవడం వల్ల ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులు లభిస్తాయి. పోషక విలువలు పుష్కలంగా ఉంటాయి. కూరగాయలు, పండ్లు రుచిగా ఉంటాయి.
- వాతావరణంలో కాలుష్యం బాగా తగ్గుతుంది. భూమి సారవంతంగా మారుతుంది.
- పర్యావరణ సమతుల్యతకు మేలు చేసే పక్షులు, పురుగులు, ఇతర జీవరాశులను సంరక్షించవచ్చు.

తక్కువ ఖర్చుతో సాగు..



ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వరి పంట సాగు చేశాను. రసాయన ఎరువులు, పురుగు మందులు వినియోగించకపోవడంతో ఖర్చు తగ్గింది. జీవామృతంతో పాటు ఇతర కషాయాలు పిచికారీ చేయడంతో ఆరోగ్యకరమైన పంట పండింది.

– అంపిలి బుచ్చిబాబు, ప్రకృతి వ్యవసాయ రైతు, గూనబద్ర, కొత్తూరు మండలం

పంట గిట్టుబాటు



ప్రకృతి వ్యవసాయం ద్వారా పంట సాగు చేయడం వల్ల పంట గిట్టుబాటుగా ఉంటోంది. పంట ఉత్పత్తులకు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంటోంది. దిగుబడులు సైతం ఆశాజనకంగా ఉంటున్నాయి. భూమి సారవంతంగా మారుతుంది.

– ఎస్.అప్పారావు, ప్రకృతి వ్యవసాయ రైతు, లబ్బ గ్రామం, కొత్తూరు మండలం

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

రణస్థలం : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు కల్పించిన ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో ఆదాయం కోల్పోయిన డ్రైవర్లకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని ఏపీ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి డిమాండ్ చేశారు.

శనివారం రణస్థలం మండల కేంద్రంలో ఆటో, క్యాబ్ డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది నిరుద్యోగులు స్వయం ఉపాధి పథకం కింద ఆటోలు, వ్యానులు, జీపులు, కార్లు కొనుగోలు చేసి ప్రభుత్వానికి కోట్ల రూపాయల పన్నులు చెల్లిస్తున్న డ్రైవర్లకు జీవనోపాధి కరువై ఆందోళన గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఓలా, ఉబర్ ర్యాపిడో వంటి వాహనాలు ప్రవేశపట్టి డ్రైవర్లకు ఆదాయం లేకుండా చేస్తున్నారని మండిపడ్డారు. సీఎం చంద్రబాబు ప్రకటించిన సంవత్సరానికి రూ.15వేలు ఆర్థిక సాయం వెంటనే ఇవ్వాలని, కాంపౌండ్ ఫీజులు పెంచే జీఓలు 21, 31 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భారీగా పెంచిన డీజిల్ థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ వాహన విడిభాగాల ధరలు, టోల్ గేట్ ఫీజులు 30 శాతానికి తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా రూ.10లక్షలు, సహజ మరణానికి చంద్రన్న బీమా రూ.5లక్షలు వెంటనే అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

బ్యాడ్మింటన్ పోటీల విజేతగా విజయనగరం



విజయనగరం సర్కిల్ జట్టుకు షీల్డ్ అందజేస్తున్న డైరెక్టర్ చంద్రం తదితరులు

అరసవల్లి: జిల్లా కేంద్రంలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ శాఖ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు శనివారంతో ముగిశాయి. తుది ఫలితాల్లో ఓవరాల్ చాంప్‌గా విజయనగరం సర్కిల్ ఈపీడీసీఎల్ జట్టు నిలిచింది. రెండో స్థానంలో నెల్లూరు ఎస్‌పీడీసీఎల్, మూడో స్థానంలో జెన్‌కో ఆర్టీపీఎస్ కృష్ణపట్నం నిలిచాయి. శనివారం శ్రీకాకుళం విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో జరిగిన బహుమతుల ప్రదాన కార్యక్రమంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఫైనాన్స్ డైరెక్టర్ డి.చంద్రం, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ టి.వనజ, చీఫ్ జనరల్ మేనేజర్ (ఆర్‌ఏ) ఎల్.మహేంద్రనాథ్, సీజీఎం (మెటీరియల్స్) పి.శ్రీదేవి, జనరల్ మేనేజర్ కె.సురేఖ తదతరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రం మాట్లాడుతూ తొలిసారి రాష్ట్ర స్థాయి పోటీలను విజయవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ ఆఫీసర్ వడివేలు, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు, సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, జనరల్ సెక్రటరీ, డివిజనల్ ఈఈ పైడి యోగేశ్వరరావు, సెక్రటరీ మహంతి ప్రభాకరరావు, సనపల వెంకటరావు, డిప్యూటీ ఈఈ చల్లా వెంకటేశ్వరరావు, ఎస్ఏఓ ఎ.శ్రీనివాసరావు, డీ–1 ఏఈ జె.సురేష్‌కుమార్, డీ–2 ఏఈ కింజరాపు జయరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడు మృతి



ఘటనా స్థలంలో మృతదేహం

కంచిలి: మకరాంపురం సమీపంలోని 'ఆదివారం సంత' కూడలి వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పులకపుట్టుగ గ్రామానికి చెందిన పులక సన్‌రాజు(24) మృతిచెందాడు. బైక్‌పై స్వగ్రామం నుంచి జాతీయ రహదారి మీదుగా జాదుపూడి వైపు వెళుతుండగా.. బరంపురం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న శివదేవి ప్రైవేటు బస్సు ఢీకొట్టడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. సన్‌రాజు కేరళలో ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తుండేవాడు. మూడు రోజుల క్రితమే ఇంటికి వచ్చాడు. తండ్రి వాసులు వ్యవసాయం చేస్తున్నాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. తండ్రి ఫిర్యాదు మేరకు కంచిలి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాత్రి 12 గంటల వరకు బార్‌ల నిర్వహణ

ఇచ్ఛాపురం: మద్యం బార్‌లను ఉదయం 10 నుంచి రాత్రి 12 గంటల వరకు నిర్వహించుకోవచ్చని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయాన్ని శనివారం సందర్శించి అధికారులు, లైసెన్సులు పొందిన మద్యం దుకాణాల నిర్వాహకులతో సమీక్ష నిర్వహించారు. బార్‌పాలసీ 2025–28పై చర్చించారు. వ్యక్తిగతంగా ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చని, ఎన్ని లైసెన్సులైనా పొందవచ్చని చెప్పారు. నాలుగు కంటే ఎక్కువ దరఖాస్తులు వస్తే లాటరీ తీస్తామన్నారు. ఈ నెల 26సాయంత్రం 5గంటల్లోపు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 28న శ్రీకాకుళం అంబేడ్కర్ ఆడిటోరియంలో డ్రా తీస్తారని చెప్పారు.



బోర్డు నుంచి రోడ్డు వరకు..!

ఉపాధ్యాయుడు అంటే తరగతి గదిలో చదువు చెప్పడమే కాకుండా విద్యార్థులు బడికి వచ్చినప్పటి నుంచి ఇంటికి వెళ్లే వరకు బాధ్యత వహిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఇచ్ఛాపురం మండలం ఈదుపురం కంద్రావార్డు ఒడియా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాస్ రంజన్ పట్నాయక్. ఈ పాఠశాలలో 130 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాల రోడ్డు పక్కనే ఉండటంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో విద్యార్థుల హాజరు శాతం తగ్గిపోతుండేది. ఈ నేపథ్యంలో హెచ్ఎం ఉదయం 8 గంటలకు, సాయంత్రం బడి విడిచిపెట్టే సమయంలో ఎర్రజెండాను పట్టుకొని వాహనాలకు రెడ్ సిగ్నల్ ఇస్తూ విద్యార్థులకు రక్షణగా నిలుస్తున్నారు.

– ఇచ్ఛాపురం రూరల్

బదిలీలు ముగిసిన అధ్యాయమేనా?

- కేజీబీవీ ఎస్ఓల మార్పు ఉండవనేలా అధికారుల సంకేతాలు
- న్యాయం చేస్తామని దళిత సంఘాలకు జిల్లా అధికారుల హామీ

శ్రీకాకుళం: జిల్లాలో వివాదాస్పదంగా మారిన ముగ్గురు కేజీబీవీ ఎస్ఓ(ప్రిన్సిపాల్)ల బదిలీ వ్యవహారం ఇక ముగిసిన అధ్యాయమేనా? ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే అవుననే అనిపిస్తోంది. ఈ అంశాన్ని కుల రాజకీయాలుగా చేయాలని కొందరు భావించగా.. అది బెడిసికొట్టడంతో సౌమ్యకు మద్దతు ఇస్తున్న వారిలో చీలిక తేవాలని ప్రయత్నించి సఫలీకృతమైనట్లు తెలియవచ్చింది. కొన్ని దళిత సంఘాలకు ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యులుగా ఉండటంతో వారిపై దృష్టి సారించి నయానా భయానా నచ్చచెప్పి వెనక్కి తగ్గించినట్లు సమాచారం. ఇందులో పొందూరు మండలానికి చెందిన ఓ అధికారి కీలకంగా వ్యవహరించి చాలామందిని వెనక్కి తగ్గేలా చేసినట్లు భోగట్టా. కొన్ని ఉపాధ్యాయ సంఘాలకు కూడా రాష్ట్రస్థాయి నుంచి అందుతున్న సమాచారం మేరకు ఈ వ్యవహారం ముగిసిన అంశంగా తెలుస్తోంది.

ఫిర్యాదులా.. సిఫార్సులా?

ప్రస్తుతం కేజీబీవీ ప్రిన్సిపాళ్లకు బదిలీ చేసే అవకాశం లేదు. ఇటీవలే పరస్పర బదిలీలకు అవకాశం కల్పించారు. బదిలీలపై ఆంక్షలు ఉన్న తరుణంలో పరిపాలన సౌలభ్యం కోసం అని చెబుతూ జిల్లా సమగ్ర శిక్ష అధికారులు బదిలీలు చేశారు. ఇటువంటి బదిలీలు చేయాల్సి వచ్చినప్పుడు ఆయా ఉద్యోగులపై ఆరోపణలు వస్తే విచారణ జరిపించి ఆ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. పొందూరు ప్రిన్సిపాల్ గా పనిచేస్తున్న సౌమ్యపై ఆమదాలవలస శాసనసభ్యుడు కూన రవికుమార్ జూలై 2న ఫిర్యాదు చేశారు. అదే రోజున కంచిలి కేజీబీవీ ప్రిన్సిపాల్‌పై ఇచ్ఛాపురం శాసనసభ్యుడు బెందాళం అశోక్ కూడా బదిలీ కోసం ఏపీసీకి లేఖ రాయడం గమనార్హం. ఈ లేఖలో ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారా? ఆమెకు బదిలీ చేయాలని సిఫార్సు చేశారా అన్నది తెలియాల్సి ఉంది. ఫిర్యాదు చేస్తే ఆమెపైన కూడా విచారణ జరపాలి కానీ అటువంటి దాఖలాలు లేవు. జూలై 24న కాకినాడ ఆర్‌జేడీ మాత్రం పొందూరు ప్రిన్సిపాల్‌పై విచారణ జరిపి నివేదిక ఇచ్చినట్లు, దాని ఆధారంగానే బదిలీ చేసినట్లు సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు.

సౌమ్యపై వచ్చిన ఆరోపణలను వెల్లడిస్తున్న అధికారులు, రాజకీయ నేతలు కంచిలి ప్రిన్సిపాల్ పై వచ్చిన ఆరోపణలు ఏంటన్నది మాత్రం వెల్లడించడం లేదు. పోనీ ఆమెపై ఆరోపణలు లేకుండా కేవలం ఎమ్మెల్యే సిఫార్సుతో బదిలీ చేశారనుకుంటే నిబంధనల ప్రకారం పరిపాలన సౌలభ్యమైన బదిలీ జరిపేందుకు అవకాశాలు లేవు. అంటే సమగ్ర శిక్ష అధికారులు జిల్లా, రాష్ట్ర అధికారులను కూడా తప్పుదోవ పట్టించినట్లు అర్థమవుతుంది. అదే విధంగా, జూలై 28న శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ గార ప్రిన్సిపాల్‌పై ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై కూడా ఎటువంటి విచారణ చేయించకుండా గతంలో పొందూరు ప్రిన్సిపాల్‌పై మాత్రమే విచారణ జరిపించిన అంశం ఆధారంగా సమగ్ర శిక్ష ఏపీసీ అత్యుత్సాహంతో త్రికోణ బదిలీకి ఉపక్రమించారు. ఇప్పుడు ఈ వ్యవహారం వివాదాస్పదం కావడంతో ఏదోలా సర్దుబాటు చేయాలని యోచించినా అది చేయలేని స్థితికి చేరింది. పొందూరులో బాధ్యతలు చేపట్టిన గత గార ప్రిన్సిపాల్‌ను తిరిగి వెనక్కి రప్పించాలనుకుంటే స్థానిక శాసనసభ్యులు అంగీకరించే పరిస్థితి ఉండదు. గారలో బాధ్యతలు చేపట్టిన గత కంచిలి ప్రిన్సిపాల్‌ను వెనక్కి పంపించేందుకు ఆమదాలవలస ఎమ్మెల్యే ఒప్పుకునే పరిస్థితి లేదు. సౌమ్యను పొందూరులో తిరిగి నియమించేందుకు అంగీకరించే పరిస్థితి కనిపించడం లేదు. ఇదిలా ఉంటే సౌమ్యకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో ఎస్ఎస్ఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని దళిత సంఘాలు జిల్లా కలెక్టర్‌కు లిఖిత పూర్వకంగా తెలియజేయగా, ఆయన సూచనల మేరకు సమగ్ర శిక్ష ఏపీసీని దళిత సంఘాలు కలిశాయి. ఈ సందర్భంగా ఏపీసీ సౌమ్యకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంపై సోమవారం నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఆటో ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు



రాజగోపాల్‌ను పరామర్శిస్తున్న చింతాడ రవికుమార్

పొందూరు: గోరింట గ్రామ సమీపంలో ఆటో ఢీకొనడంతో ద్విచక్ర వాహనచోదకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెనుబర్తి ఐఆర్ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మడపాన రాజగోపాల్ ద్విచక్ర వాహనంపై గోరింట వైపు వెళ్తుండగా పొందూరు నుంచి వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో రాజగోపాల్ తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని అంబులెన్సులో శ్రీకాకుళంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పొందూరు ఎస్సై వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. విషయం తెలుసుకున్న ఆమదాలవలస నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆస్పత్రికి వెళ్లి రాజగోపాల్‌ను పరామర్శించారు. ఆయనతో పాటు పెనుబర్తి నాయకులు తమ్మినేని మురళీకృష్ణ, పూర్ణ తదితరులు ఉన్నారు.

ఇద్దరు బైక్ దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకట అప్పారావు

పలాస: గరుడఖండి గ్రామానికి చెందిన కవిటి నిఖిలేశ్, గజపతి జిల్లా కాశీనగరం వాసి తూముల కార్తికేయ అనే ఇద్దరు బైక్ దొంగలను కాశీబుగ్గ పోలీసులు అరెస్టు చేశారు. డీఎస్పీ వి.వెంకట అప్పారావు శనివారం కాశీబుగ్గ పోలీస్ డివిజనల్ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. నిఖిలేశ్, కార్తికేయ శ్రీకాకుళంలోని ఒక ప్రైవేట్ స్కూల్లో పదో తరగతి వరకు చదివారు. అనంతరం వ్యసనాలకు బానిసై దొంగతనాలకు పాల్పడుతుండేవారు. విశాఖపట్నంలో ఓ చోరీ కేసులోనూ పట్టుబడ్డారు. ఈ క్రమంలో నిఖిలేష్ మెళియాపుట్టిలోని తన బంధువుల ఇంటి నుంచి వస్తూ టెక్కలిపట్నంలో దాసరి సురేష్ అనే వ్యక్తి బైక్‌ను చోరీ చేసి పట్టుకుపోయాడు. అలాగే గార మండలానికి చెందిన మెండ వెంకటేశ్వరరావు కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద బైక్ ఉంచగా కార్తికేయ పట్టుకుపోయాడు. రెండు బైకులను విశాఖలో అమ్ముతుండగా సమాచారం అందుకున్న పోలీసులు ఇద్దరినీ అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. సమావేశంలో కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఇంటిపై ఆర్మీ జవాన్ దాడి

ఇచ్ఛాపురం రూరల్: మద్యం మత్తు, పాతకక్షలతో ఓ ఆర్మీ జవాన్ ఎంపీటీసీ ఇంటిపై దాడికి పాల్పడ్డాడు. వెంటనే ఎంపీటీసీ అనుచరులు ఆర్మీ జవాన్‌కు దేహశుద్ధి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇచ్ఛాపురం మండలం మండపల్లి–2 ఎంపీటీసీ సభ్యుడు కాళ్ల గోపాలరావు ఎం.తోటూరులో నివాసముంటున్నారు. అదే గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వగాడ నర్సింహమూర్తి ఇటీవల సెలవుపై వచ్చి శుక్రవారం అర్ధరాత్రి రెండు గంటలకు ఎంపీటీసీ గోపాలరావు ఇంటికి వెళ్లి సీసీ కెమెరాలు ధ్వంసం చేయడంతో ద్విచక్ర వాహనాన్ని ధ్వంసం చేసి, మరో ద్విచక్ర వాహనాన్ని వెంట తీసుకుపోయాడు. వేకువ జామున మూడున్నర గంటలకు ఇచ్ఛాపురం గొల్లవీధిలో ఉంటున్న కొరికాన జ్యోతి తలపై బలంగా దాడికి పాల్పడ్డాడు. ఉదయం మరోసారి ఎంపీటీసీ ఇంటి వద్దకు వచ్చి ఆరుబయట ముగ్గు వేస్తున్న ఎంపీటీసీ భార్య కాళ్ల నీలవేణిపై, అడ్డుకున్న గోపాలరావుపై కర్రతో దాడి చేశారు. దీంతో ఎంపీటీసీ అనుచరులు ఆర్మీ జవాన్‌కు దేహశుద్ధి చేశారు.

ఇరు వర్గాలు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ ఎం.ముకుందరావు కేసు నమోదు చేశారు. మూడు నెలలు క్రితం ఆర్మీ జవాన్ నర్సింహమూర్తి ఎంపీటీసీ గోపాలరావుకు చెందిన కారు అద్దాలను ధ్వంసం చేయగా, అప్పట్లో ఆయనపై రూరల్ పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. పాత కక్షతో ఇప్పుడు కూడా ఇదే రీతిలో దాడులు చేశాడని పోలీసులు తెలిపారు. క్షతగాత్రులను ఇచ్ఛాపురం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు చెప్పారు.